కోరికలు అందరికీ వుంటాయి. అయితే, కోరికలు తీర్చుకునే అవకాశం వుండేది కొందరికే. మిగతా వాళ్ళు, కోరికల్ని చంపుకుంటే తప్ప తాము బ్రతకలేరేమో!

మాచన్నసంజీవరెడ్డి



# వలయం

"ఓయమ్మో! గిది ఇంక ఏడాది ఆగుతదా!?" సగం పాతవడిన రైకను తల్లికి చూపిస్తూ మంగ అంటున్నది.

"ఏందే గట్లంటవు! నా ఎరుకల గసొంటి రైకలను ఏడాది రెండేండ్లు తొడిగేదాన్ని" తల్లి మంగ మాటలకు ఆశ్చర్యపడుతూ ముక్కు మీద వేలేసుకుంది.

"ఓయమ్మో! నాకు తెలుసు తియ్యే! నేను చిన్నప్పటినుంచి చూస్తున్న నిన్ను యెన్నడైన రైక తొడిగినవనా! ఎప్పుడో పండగకో, పబ్బానికో యెవరో యిచ్చిన రైకతొడిగి, మళ్ళీ పెట్టెల పెడుదువు. వట్టి రోజుల్లో గిదేచీర కొంగును రొమ్ముల చుట్టూ తకప్పుకొందువు. గట్లైతే రెండేండ్లుగాదే పదేండ్లు తొడగొచ్చు!" తల్లిమాటలనుమామూలుగానే దులిపేసింది.

మంగకు మాట్లాడేముందు ప్రతిసారి "ఓ యమ్మో" అనడం అలవాటు. మనం

దేన్నిగురించి చెప్పినా "నాకు తెలుసు తియ్యి" అని మూతి మూడు వంకర్లు తిప్పటంకూడా అలవాటే.

"ఆఁ పెద్దగ జెప్ప కే! నా ఈడు కొచ్చాక నువ్విట్లనే మాట్లాడుతవా? నేను జూడకపోతనా! అయినా ఆ సీతిగాడ్నిచ్చి పెళ్ళిచేశాక ఈ మాటలు సాగతియ్యి!"

తల్లి ఉడికించాలని అంది. ఆ మాటతో మంగ మూతి మూడు వంకరుతిప్పి—

"ఓయమ్మో! నువ్వు సీతిగాడికిచ్చి పెళ్ళి చేస్తే చేసుకుంటో లెవరు లేరిక్కడ!.... సీతిగాడిని చచ్చినా పెళ్ళిచేసుకోను. నాకు పెళ్ళిగాకున్నాసరే!" అంది.

"సరేగాని వాడిని ఎత్తుకో.... ఏడుస్తున్నడు." మనవడ్ని చూపిస్తూ అంది తల్లి. మంగ అన్న కొడుకు వాడు.

"ఓ వొదినా! ఏం చేస్తున్నవమ్మ గుడిసెల? పోరదేడుస్తున్నడు ఇనిపిస్తలేదా!? వాడికి జెరన్ని పాలియ్యక పోయినవు" అంటూ వదినమీద రుసరుస లాడింది.

"వాడికి పాలిప్పుడే ఇచ్చినగాని ఎత్తుకోవాలని ఏడుస్తుండు వాడు. జెర ఎత్తుకో రాదు" అంది లోపలినుంచి.

వాడ్ని ఎత్తుకుంది. ఏడుపు మానాడు. ఎత్తుగా కన్పిస్తున్న రొమ్ములవంక ఓసారి చూసి అందులో తల దూర్చాడు. చేతులతో తడిమాడు. మంగకు చక్కిలిగిలి పెట్టినట్టయింది. ఎక్కడో కోరిక రేగినట్టయింది. అయ్యి పైకిమాత్రం.

"నువ్వు పాలు బాగనే యిచ్చినట్టుంది. చూడు వాడేమి చేస్తున్నడో!" అంటూ లోపలికెళ్ళి వదినకు చూపించింది. ఆమె చూసి చిన్నగా నవ్వింది. మరదలిని వుడికించాలని "అయితే వాడికి నీ వియ్యరాదు. ఏమయితది!?" అంది నవ్వుతూ. "ఛీ సిగ్గులేదు నీకు" అంటూ బయటకు వచ్చింది. గుడిసె వెనుకకు పోయింది. ఎవరు లేకుండా చూసి రొమ్ముతీసి వాడి నోటికందించింది. వాడు "జుప జుప" రొమ్మును చీకుతుంటే తృప్తిగా కళ్ళు మూసుకుంది. ఎక్కడో అంతరాంతరాలలో మెదిలిన కోర్కెను తీర్చుకుంటున్నది. అది తప్పని అనుకోవటం లేదామె.

'తనకు కోరికగానే వుంది. పెళ్ళి చేసుకోవాలని, పిల్లలను కనాలని, వాళ్ళు పాలు చీకుతుంటే తృప్తిగా కళ్ళు మూసుకోవాలని. ఇదంతా వొదినను చూస్తుంటే అనిపిస్తుంది. కాని ఆ సీతిగాడిని పెళ్ళి చేసుకుంటే ఏముంది? కూలినాలి చేసుకుని బతకాలి. రోజంతా ఇద్దరం కష్టపడ్డా ఏం మిగులుతుంది? తన బతుకేం బాగుపడుతుంది? తను అమ్మ బతుకు చూడటం లేదా!' ఇలా ఆలోచిస్తుంది మంగ.


**WISH TO SEEK ADMISSION INTO**

**B. E/B. Tech./M. B. B. S.**

JNTU/OSMANIA/REC-WARANGAL/AP MEDICAL COLLEGES
FOR SURE SUCCESS JOIN ENTRANCE COACHING IN

**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**

[Member, Indian Society for Training & Development]
Saraswathi Theatre Junction, VISAKHAPATNAM-530 020

**CLASSES : 24-5-80 to 8-7-80 (45 days)**

Total Coaching Fee : Rs. 200/- Total Hostel Fee : Rs. 340/
Coaching Fee Concession is available to S C/S T Candidates
Separate Hostels for Boys and Girls

**C.K. Haranadha Rao,**
B.Sc., M.Tech., M.I.A.E., M.I.S.T.D., M.I.I.W., M.I.S.T.E., M.I.S.E.,
DIRECTOR.



పళ్ల డాక్టర్లు చెబుతున్నారు
చిగుళ్ల బాధలు, దంతక్షయం అరికట్టడానికి,
నియమానుసారంగా పళ్లను బ్రష్ చేసుకొని,
చిగుళ్లను మాలిష్ చేసుకోవాలి.

**ఫోర్‌హేన్స్ డబుల్ యాక్షన్ టూత్‌బ్రష్ వాడండి**

మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్ కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.




పళ్లను బ్రష్ చేసుకోవడానికి, చిగుళ్లను మాలిష్ చేసుకోవడానికి ఫోర్‌హేన్స్ పద్ధతి నేర్చుకోండి. "పళ్లు, చిగుళ్లను గురించి తీసుకోవలసిన శ్రద్ధ" అనే రంగుల పుస్తకం ఉచితంగా కావాలంటే పోస్టు ఖర్చుకోసం 25 పైసల స్టాంపు జతపరుస్తూ ఈ చిరునామాకు వ్రాయండి: ఫోర్‌హేన్స్ డెంటల్ అడ్వైజరీ బ్యూరో, డిపార్టుమెంట్ నెం. B46-219, పోస్టు బేగ్ 11463, బొంబాయి 400 020. ఏ భాషలో కావాలో వ్రాయండి.

**ఫోర్‌హేన్స్ టూత్‌బ్రష్‌లు**
ఇంటిల్లిపాది కోసం
అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్) * జూనియర్ * బేబీ

Regd. T.M: Geoffrey Manners & Co. Ltd. 219F-152 TEL.

## మల్లెపందిరి

### చికటి విత్తనాలు

క్షేమేంద్రుడు సాయంకాలాన్ని వర్ణిస్తున్నాడు :

సంకోచ వ్యతికరబద్ధభీతిలోలై
ర్నిర్యాద్భి ర్భ్రమరభరైః సరోరుహేభ్యః
ఆరబ్ధః క్షణమివ సంధ్యయా జగత్యాం
ఉత్పత్త్యై ఘన తిమిరస్య బీజవాపః ॥

ముడుచుకుపోతున్న సమయంలో భయంతో కంగారుగా కమలాలలోనుంచి బైటపడుతున్న భ్రమరాలతో సంధ్యాదేవి లోకంలో దట్టమైన చీకటి పుట్టడం కోసం విత్తనాలు చల్లడం ఆరంభించిందా అన్నట్టుంది క్షణకాలంపాటు.

సంధ్యాకాలం-సాయంకాలం పద్మాలు ముడుచుకుంటాయి. అంతవరకూ మకరందాన్ని గ్రోలుతున్న తేనెటీగలు, తలుపులు మూసేస్తూంటే బైటపడుతున్న క్లబ్ మెంబర్లలా బైటికి చెల్లాచెదురుగా వచ్చేస్తున్నాయి. (మరీ మత్తులో వున్నవి అక్కడే బంధింపబడి పోతాయనుకోండి) అవి నల్లని గింజల్లా వున్నాయి. అందుచేత ఆ క్షణంలో చీకటి విత్తనాలు చల్లడం ఆరంభించిందిలా అనిపిస్తోంది. ఎందుకంటే తత్పరిణామంగా వెంటనే చీకటి దట్టంగా పుట్టుకురావడం కనపడుతోంది. సంధ్యాదేవికీపనిని ఎవరో అప్పచెప్పారు కాబోలు. అందుకే తనపని తాను నిర్వర్తించుకుని మరీ వెళ్ళిపోతోంది.

—సౌభరి

"అసినీ పాపం పాడుగాను! నేనేదో మాట వరసకు నవ్వుకుంట అంటే నువ్వు అన్నంతపని జేస్తున్నవన్నమాట" అంటూ వదిన చూసి నవ్వడంతో రొమ్ముకు రవిక కిందకు దోపుకుంది. ఏదో తప్పు చేసిన దానిమల్లె నీళ్ళు నమిలింది. "లేదు....లేదు వాడే...." అని ఏదో చెప్పబోయింది. కాని—

"ఎందుకు మరదలా అంత భయపడతవు! ఈ ఏడు పెళ్ళిజేస్తె మరో ఏడు నీకూ్కడా పుడుతుందిలే బిడ్డ. అప్పుడు ఈ భయముండదు. అందరి ఎదురుగ్గానే పాలివ్వొచ్చు." అంటూ గుడిసెలోకి పోయింది వదిన. ఆ తర్వాత గుడిసెలోంచి సీతిగాడు చూడ్డంతో సిగ్గుతో ముఖం చాటు చేసుకుని మంగకూడా గుడిసెలోకి పోయింది.

అక్కడ దాదాపు పాతిక గుడిసెలవరకు వున్నవి. ఆ గుడిసెల్లోని వారంతా కూలి నాలి చేసుకుని బ్రతికేవాళ్ళే. మంగ కుటుంబంతో చాలవరకు సాన్నిహిత్యం కలవారే. వాళ్ళంతా యాభై ఎకరాలకు వారసుడయిన భూమిరెడ్డి తండ్రి దగ్గర పని చేస్తున్నారు.

అక్కడే గుడిసెలు వేసుకుని పొలంలో పనిజేస్తె బావుంటదని భూమిరెడ్డి తండ్రి వాళ్ళందరికి సలహా ఇచ్చాడు. దానికి వాళ్ళంతా సరేనన్నారు. వుండటానికి ఇల్లు లేనివాళ్లు భూమిరెడ్డి తండ్రిని దేవుడిగా భావించారు. అక్కడే గత పాతిక సంవత్సరాల నుంచి నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

అప్పుడు మంగ తల్లి వయస్సు సరిగ్గా పాతిక. మంగయింకా పుట్టలేదు. ఇక్కడికొచ్చాక అయిదారు సంవత్సరాలకు మంగ పుట్టింది. అప్పటినుంచి యిప్పటిదాకా మంగ తల్లి వయస్సు పెరిగింది. గుడిసెల సంఖ్య మరో అయిదారుకు పెరిగింది. కాని వాళ్ళ బ్రతుకుల స్థాయి మాత్రం పెరగలేదు. కాని భూమిరెడ్డితండ్రి మాత్రం ఓ చిన్నపాటి డాబా వేశాడు. కొడుకుని పట్నంలో పై చదువుకు పంపించాడు. ఇదంతా చిన్ననాటి నుంచి చూస్తూనేవుంది మంగ. వాళ్ళ బ్రతుకులు బాగుపడినట్టు తమ బ్రతుకులెందుకు బాగుపడవని మనసులో చాలాసారు అనుకుంది. కాని పైకి యెప్పుడూ అనకపోయేది. అయినా వాళ్ళలాగ యేనాటికో ఒకనాటికి కావాలనే ఆశ ఆమె హృదయాన్ని తొలిచేది.

చిన్నప్పుడు ఒకటి రెండుసార్లు భూమిరెడ్డిని ఆటలాడుకుందామని పిలిచింది. కాని వాళ్ళమ్మ చూసి 'ఆ గుడిసెల పోరలతో నీకేమి ఆటరా, నడవ్ ఇంట్లకు' అని పిలుచుకపోయేది. ఆ సంగతి ఇంటికొచ్చాక అమ్మతో చెపితే, 'నిజమేనే వాళ్ళు మనకంటె పెద్దోళ్ళు- వాళ్ళతో మనం ఆటపాట ఆడకూడదు. అయినా నీకు ఆడుకోవాలని వుంటే మన గుడిసెల్లో పిల్లల్లేరా! వాళ్ళతో ఆడుకో' అనేది. అప్పటినుంచి మంగ భూమిరెడ్డిని ఆటలాడుకుందామని పిలవకపోయినా ఓకంట ఎప్పుడూ అతన్ని గమనించేది.

మంగ పెద్ద మనిషయ్యాక కూడా-భూమిరెడ్డి పట్నం నుంచి వస్తే చూసి మురిసిపొయ్యేది. అతడు నూనూగు మీసాలను దువ్వుతూ, సిగరెట్టును పెదాలమధ్య నుంచుకుని అంటించుకున్నప్పుడు తదేకంగా అతనివైపే గుడిసె సాటునుండి చూసేది. ఎర్రని పెదాల మధ్యనుండి ఒదిలిన సిగరెట్ పొగ గాలిలో ఆటలాడుతుంటే అందులో తనకాబోయే మగడి రూపాన్ని అందంగా చూసుకునేది. అంతే తప్ప సీతిగాడ్ని పెళ్ళి చేసుకోటానికి ఇష్టపడేదికాదు.

* * *

"మంగా! పొయ్యిమీదిన్ని 'చా' నీళ్ళు పెట్టే. అవి తాగి పడుకుంటా." తల్లి మంచం పైన పడుకుని మూలుగుతూఅంది. మంగతల్లి మాటలువిని పొయ్యిమిదనీళ్ళు పెట్టింది.

వారంరోజులనుంచి తల్లి మంచం పట్టింది. అప్పటినుంచి ఒకటే పోరు— "ఆ సీతిగాడ్ని పెళ్ళిచేసుకోయే. నాకే బాధ వుండదు. నా పాణం ఇయ్యాల్నో, రేపో అన్నటుంది. ఆ యింత నీ మెళ్లో పుస్తెల తాడుజూసి పోతనే" అని. కాని, మంగ విన్పించుకోవటంలేదు. "సీతిగాడ్ని చచ్చినాసరే పెళ్ళి చేసుకోను" అని మంకు పట్టింది. "మరెవర్ని చేసుకుంటవె?" అని తల్లి అడిగితే "మంచోడ్ని పెళ్ళి చేసుకుంట. పట్నంల సదువుకుంటోణ్ణి, భూమిరెడ్డి పటేల్లాంటోణ్ణి...." అని సమాధానమిస్తుంది. తల్లి కూతురు మాటలు విని నవ్వుకుని "పిచ్చిది— దానికేం తెల్వదు" అనుకుంటుంది. "ఈ వయసులో యెవరికైనా గట్లనేఅన్పిస్తుందే. నీ వయసప్పుడు నేనుకూడా నీ లెక్కనే అనుకునేదాన్ని. కాని, మంచి మొగడు ఏడికేలి వస్తడేను వ్వే ఆలోసించు" అంటూ కూతురిని లాలించి అడుగుతుంది. మంగ ఏడుస్తుంది- 'సీతిగాడ్ని పెళ్ళి చేసుకుంటే

## చిట్లిన పాళీ!

"స్ప్రెడ్" అవుతున్న సిరాలా
బ్రతుకు
పెన్ను తిన్నగా నడవదు
కలిసివున్న చీలికలైనా
రెండుగా చిట్లినపాళీ
అతుకును విడిచిన ఖాళీ
చతికిలపడినట్లు తాళి
మొండికేసి కదల్నే కదలదు
బండగానైనా బరకదు!

—డాక్టర్ వడ్డమూడి
గోపాలకృష్ణయ్య

నీలాగనే నేనూ బ్రతకాల్నె! ఇటువంటి బ్రతుకు నాకొద్దే' అంటుంది.

'మరేం చేస్తవే? మంచి మొగుడ్ని ఏడికేలి తెచ్చుకుంటవే?' అన్నప్పుడు ఎటో శూన్యంలోకి చూసుంది. ఏమి అర్థంకాక 'నేను పెళ్ళి చేసుకోనే' అంటుంది.

కాని రోజు సీతిగాడు అమ్మ దగ్గరకు డాక్టరును తీసుకొచ్చి మందులిప్పిసుంటే అతనిపై జాలేసింది. ఏదో ఒక మూల మంగకు తెలియకుండానే సీతిగాడిపైన ప్రేమ పుట్టింది.

డాక్టరు రోజు వచ్చి మందులిస్తున్నా అమ్మ మంచం మీదనుంచి లేవటంలేదు. రోజురోజుకు అమ్మ మంచానికే అంటుకుపోతూంది. మంగకుభయమేసింది. అమ్మ చచ్చిపోతదేమో ననుకుంది. "నేను బ్రతికుండగానే నీ మెళ్ళో పసుపుతాడు ఏసుకోయే మంగీ" అని తల్లి కళ్ళలో నీళ్ళు నింపుకున్నప్పుడు "సరే" అని తలూపింది. తల్లి సంతోషంతో సీతిగాడ్ని పిలిచి ఇద్దరి చేతులు కలిపింది. సినిమాలలో మాదిరి ఇద్దరి చేతులు కలిపి కన్నుమూయలేదు. ఆ సంతోషంలో మంచం మీదనుంచి లేచింది. మళ్ళీ మామూలు మనిషయింది.

ఓ మంచి ముహూర్తాన ఆ గుడిసెల్లోని పెద్దమనుషులు మంగను సీతిగాడికిచ్చి పెళ్ళిచేశారు- పెళ్ళిపందిరి లేదు. పెళ్ళిపీటలులేవు. బాజా భజంత్రీలు లేవు. పప్పన్నాలు లేవు. బిరియానీలు- కోడిపలావులు లేవు. ఆఖరుకి మెళ్ళో పుస్తెలతాడుకూడా లేదు! కేవలం పసుపుతాడుతో పెళ్ళయిందనిపించారు.

మరో ఏడాది తిరిగేసరికి మంగకు బిడ్డ పుట్టింది. బిడ్డకు మంచి పేరు పెట్టాలని చాలారోజులు ఆలోచించింది. మామూలుగా వాళ్ళు పెట్టుకునే పేర్లు ఆమెకు నచ్చలేదు. మంచి పేరుకోసం తెగ వెతికింది. కాని, ఎక్కడా మంచిపేరు దొరకక ఏడాది పాటు ఊరికే 'పాప' అని పిలుచుకుంది.

చిన్నప్పుడు తను ఆటలాడుకునే రోజులు గుర్తు తెచ్చుకుంది. ఎదురెదురుగా రెండు గుంపులు చేరి, వరసగా కూర్చున్నాక ఒక గుంపుకు తను,మరో గుంపుకు మరొకరు. "పెద్ద"గావుండి, ఏవో వాళ్ళకు పేర్లుపెట్టి, ఎదురు గుంపులో కెళ్ళి, ఎవరో ఒకరి కళ్ళు మూసి "చామంతీ .... చామంతీ మెల్లగొచ్చి గిల్లిపో" అనే ఆటలోని పేర్లను తిరగేసింది. "గులాబి. గన్నేరు. మల్లె. సంపంగి. "ఛ. ఇవేవి బాగలేవ"నుకుంది. "బుచ్చి" అని ముద్దుగా పిలిస్తే బావుంటుందేమో అనుకుంది. దానికంటే 'పాప' పేరే బావుంది. అదే వుండనీలే అని సరిపెట్టుకుంది. "పాప" అని పిలవటం మొదలుపెట్టింది.

పాపకునాలుగుసంవత్సరాలు వచ్చాయి. ఈ లోపల భూమిరెడ్డి తండ్రి చచ్చిపోయాడు. తండ్రి పోవటంతో భూమిరెడ్డి చదువు మానేసి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. పెళ్ళి కూడా చేసుకున్నాడు. రెండేళ్ళ కిందటనే కొడుకుకూడా పుట్టాడు. కొడుకుకు ఇంటిదగ్గరే AB Cలు నేర్పించాడు. మరో ఏడాదికి పట్నం పంపించాడు చదువు కోసం. ఆ తర్వాత భార్యని కూడా పట్నం పంపించేశాడు కొడుకుని చూసుకోవడానికి.

ఇదంతా మంగ చూస్తూనే వుంది. ఆమెకు ఏదో చేయాలనే కోరిక పుట్టింది. తన బిడ్డను కూడా చదివించాలనుకుంది. కాని దగ్గరలో బడిలేదు. ఇంట్లోనే చెపుదామనుకున్నా తనకు చదువు రాదు. మూడు కిలోమీటర్ల దూరంలోని మరో ఊళ్ళో బడి వుంది. కాని అక్కడికెవరూ ఇక్కడనుంచి బడికి వెళ్ళరు. ఒక్కత్తిని దీన్నెలా పంపించేది? ఆలోచించింది.

"ఏమే! పన్నెండయినా నువ్వింకా పొలంలకు రాలేదు. మూడు రూపాయలు ఎట్ల వస్తయనుకున్నవే?" అంటూ భూమిరెడ్డి ప్రవేశించాడు. ఇంకా అప్పుడు పన్నెండు కాలేదు. అయినా అలా అంటేనే కాని వాళ్ళు గుడిసెలు వదలరని అతని ఉద్దేశం.

"వస్తున్న పటేలా.... బుడ్డదానికి ఇంత తినిపించి...." అంటూ [illegible]సిగింది.

"సరే- తొందరగెళ్ళు! అంత పొలం[illegible]


శ్రీటెక్స్
ఫ్యాబ్రిక్స్
ఇంటింటి
అవసరాలకు...
ఇంటిల్లపాది
ఆనందానికి...
శ్రీటెక్స్
దుప్పట్లు
శ్రీటెక్స్
తువ్వాళ్ళు
శ్రీటెక్స్
ఫర్నిషింగ్స్
అందానికి...
ఆకర్షణకి..
మన్నికకు...నమ్మికకు
మేలైన రంగులకు
వాడండి!
SreeTex SALEM
ఉత్పత్తిదారులు:
ఓ.జి. టెక్స్‌టైల్స్
(ప్రై) లిమిటెడ్.
సేలం-636006

కొచ్చిండ్రు నువ్వే రాలేదు" అంటూ వెళ్ళిపోయాడు భూమిరెడ్డి.

గట్టిగా ఊపిరి పీల్చుకుంది. తనకంటే వయసులో చిన్నోడు పటేలు. తన కళ్ళ ముందే పెరిగిండు. పట్నంలో చదివిండు. పెళ్ళి చేసుకుండు. మంచి భార్యని తెచ్చుకుండు. కొడుకును కన్నడు. చదువుకోసం పట్నం పంపించిండు. అంతా అతనికి ఏ కష్టం లేకుండా జరిగిపోయింది. తను రోజంతా కష్టపడ్డా మూడు రూపాయలు, ఆయనకు నాలుగు రూపాయలు. మొత్తం ఏడు రూపాయల ఆదాయం. తిండికి రోజు రెండు కిలోల బియ్యం కావాలి. నాలుగు రూపాయలు ఖర్చు. యింకా ఉప్పు, పప్పు దానికో రూపాయిదాకా ఖర్చు. ఇక మిగిలింది రెండు రూపాయలు. వొంటిని కప్పుకోటానికి బట్టలు కావద్దు! వాటికి అంతంత మాత్రమే సరిపోతున్నాయవి. పండగ పబ్బంవస్తే పదో పాతికో ఖర్చు. ఎక్కడ నుంచీ బాగుపడుతుంది తమ బతుకు? ఎలా చదివిస్తుంది తన బిడ్డను? ఆలోచించిన కొద్దీ అన్నీ ప్రశ్నలే! సమాధానాలు లేవు" అనుకుంది.

కిందామీదా తంటాలుపడి 'పాప'కు ఎనిమిదేండ్లు నిండాక పక్క ఊళ్ళోని బడికి పంపింది. అదైనా రెండక్షర ముక్కలు నేర్చుకుంటే చాలనుకుంది.

"భూమి గుండ్రంగా వుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది. భూమి సూర్యుని చుటూతా ఒకసారి తిరగడానికి సంవత్సరం పడుతుంది" పాప ఏదో చదువుతూ పోతుంది. మంగ పాపవంక చూస్తూ చిన్నగా నవ్వుకుంది.

'పుస్తకాల్లో దేన్ని గురించో రాస్తరను కుంది తను. కాని, తమ గురించే రాసినట్టుంది. భూమిలాగ తమ బతుకులుకూడా గుండ్రమే! తమ బతుకులచుట్టూతా తాము తిరుగుతూ కొందరి బతుకులచుట్టూతా తిరుగుతున్నారు తనలాంటివాళ్లు తనలాంటి వాళ్ళను వాళ్ళ బతుకులచుట్టూతా తిప్పుకోటానికి- వాళ్ళదగ్గర అంత శక్తి ఉంది మరి! నిజంగా సూర్యునిచుట్టూతా భూమి తిరగక భూమిచుట్టూతే సూర్యుడు తిరిగితే? ఓయమ్మో! అలా తిరిగితే ఈ ప్రపంచం ఉంటుందా? సూర్యుడు సూర్యుడే. భూమి భూమే-ఎప్పటికైనా" అనుకుంది

కొందరు కవులు సూర్యుడ్ని దేవుడన్నారు. ఇప్పటి ఆధునిక కవులు సూర్యుడ్ని విప్లవానికి చిహ్నంగాచెప్పారు. చెపుతున్నారుకూడా! కాని మంగ దృష్టిలో సూర్యుడికి అర్థంవేరు. కొందరు లక్షాధికారులు. పెత్తందార్లు. ధనార్జనాపరులు సూర్యుడిలాంటి వాళ్ళని! వాళ్ళ చుట్టూతా బ్రతకడంకోసం తిరిగే తనలాంటివాళ్ళు భూమిలాంటి వాళ్ళని!

పాప పెరిగి పెద్దదయింది. పెళ్ళీడు కొచ్చింది. అయిదవ తరగతితోనే చదువు ఆపేసింది. ఇంట్లో యిబ్బందిగావుంటే తల్లితోపాటు పొలంలో పనిచేయటానికి వెళ్ళింది. మంగకూడా "పాప" తనకు చేస్తున్న సహాయానికి సంతోషించింది. తమలాంటి వాళ్ళకు చదువులు పనికిరావనుకుంది. ఇక పాప పెళ్ళి చేయాలని నిశ్చయించుకుంది, తన అన్న కొడుకు కిష్టిగాడికిచ్చి పెళ్ళి చేద్దామనుకుంది.

ఈ లోపల భూమిరెడ్డి కొడుకు పెరిగి పెద్దవాడయ్యాడు. ఎం. బి. బి. ఎస్. లో తండ్రి పలుకుబడితో సీటు సంపాదించాడు. భూమిరెడ్డి అదనంగా మరో పదెకరాలు కొన్నాడు. కొడుకుపేర బ్యాంక్‌లో డబ్బు జమ చేశాడు.

ఓరోజు భూమిరెడ్డి కొడుకు పొలం చూద్దామని వచ్చాడు. పాపని చూశాడు. పాపకూడా భూమిరెడ్డి కొడుకునిచూసింది. అందగాడు. బాగున్నా డనుకుంది. ఆమధ్య ఏదో సినిమా చూసింది. దాంట్లోలాగ భూమిరెడ్డి కొడుకుని ప్రేమించేద్దా మనుకుంది. కాని, సినిమాలోలాగ చిన్నప్పుడు తను అతనితో ఆటలాడుకోలేదు కదా అనుకుంది. అయినా ధైర్యంచేసింది. తల్లితో ఆ సంగతి చెప్పింది.

మంగ ఆశ్చర్యపోయింది. "ఆ పాడు ఆలోచన పెట్టుకోకమ్మా. అది సినిమాలోనేకాని మన బ్రతుకుల్లో జరగదమ్మా" అని ఓదార్చింది. కిష్టిగాడు "మంచోడని" చెప్పింది. వాడ్ని పెళ్ళి చేసుకుంటే కొంతవరకైనా సుఖపడతవంది. కాని, మంగ మాటలు పాపకు నచ్చలేదు. "నేను కిష్టిగాడ్ని పెళ్ళి చేసుకోనని" మొండికెత్తింది.

"నీ వయసులో ఉన్నప్పుడు నేనుకూడా అట్లనే అనుకున్ననే! మీ అమ్మమ్మకూడా అట్లనే అనుకుందే. కాని, మా కోరికలు తీరలేదు. పెద్దలు చెప్పిన పెళ్ళిళ్ళే చేసుకున్నం. నువ్వదే చేయక తప్పదు" మన బతుకులెప్పుడూ ఇంతేనే- నా మాటినే.." కళ్ళనిండా నీళ్ళు నింపుకుని 'పాప'కు చెప్పింది మంగ. పాపను దగ్గరకు తీసు

## చక్కెర చుక్కలు

ఆకాశం నోరు తెరిచి
చక్కెర గుళికల్లాంటి చుక్కలను
చప్పరిస్తోంది.
దిక్కులు దిక్కుతోచక ఆకాశంకేసి
మింగేసేలా చూస్తున్నాయి. ఆకాశం
చేసే
అక్రమాన్ని!
దిక్కు దిక్కుకూ ఆకాశం చుక్కలని
సక్రమంగా పంచకపోతే,
సమానత్వం చూపకపోతే,
అట్టడుగున పడివున్న దిక్కులు
అగ్నివర్షం కురిపిస్తాయి,
అండపిండ బ్రహ్మాండాలను ఏకం
చేస్తాయి,
ఆకాశం నోరు మూయిస్తాయి.
అప్పుడు,
అందరికన్న పైనున్నాననే గర్వం
ఆకాశానికి అణగక మానదు
కిక్కురుమనక దిక్కులతో చేయి
కలపక తప్పదు.

—శారదా అశోకవర్ధన్


## వధువు కావలెను

ఉన్నత తెలగ కుటుంబానికి చెందిన వధువు కావలెను. వివరాలతో బాక్సునెం. 1113, C/o ఆంధ్రజ్యోతి, సచిత్ర వారపత్రిక, విజయవాడ-10 కు వ్రాయండి.

## సంఘర్షణ

సంచలనాత్మక నవల చదవండి

రచన : M. K. శెట్టి

విప్లవవాది ప్రభాకర్ కాలేజి విద్యార్థిని ప్రేమలతల ప్రవిమల ప్రణయగాధ

ధర : రు. 10/-

అడ్రసు :

M. K. CHETTY,
No. 4, Thambu Naicken St.,
MADRAS-1.

కుని గుండెల్లో దాచుకుంది. ప్రేమతో తల నిమిరింది.

పాపతల్లి కళ్ళలోకిచూసింది.ఆ కళ్ళలో ఏం కన్పించిందో? ఆ మాటల్లో ఏం విన్పించిందో? కాని— "సరే కిష్టి బావనే పెళ్ళిచేసుకుంటా" అంటూ తలూపింది. మంగ సంతోషంతో పాపను ముద్దు పెట్టుకుంది.

ఆ తర్వాత కిష్టిగాడితో 'పాప'కు పెళ్ళయింది.

భూమిరెడ్డి కొడుకు పెళ్ళికై వచ్చిన జనానికి - అల్లుడు, కూతురు, మొగుడితో కలిసి సపర్యలు చేస్తూ మంగ "తమ బ్రతుకులెప్పుడు గింతే' అని సరిపెట్టుకుంది. ★

